క్లుప్తంగా

శ్వేతార్కలో ప్రముఖుల పూజలు



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రాన్ని రాష్ట్ర ప్రముఖులు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 108 మంది ముత్తైదువులతో సౌందర్య లహరి పారాయణం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ పర్యవేక్షణలో విశేష పంచవర్ణ అభిషేకాలు, అర్చకులు జరిపించారు. ప్రత్యేక పూజల్లో ప్రముఖ సినీ గాయకుడు మిట్టపల్లి సురేందర్, సినీ దర్శకుడు డాక్టర్ ఖాజా మన్సూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కోడలు సౌమ్య పాల్గొన్నారు. వారిని స్వామివారి శేష వస్త్రాలతో త్రిగుళ్ల శ్రీనివాస్ శర్మ సన్మానించి ఆశీర్వచనం అందజేశారు.

గీత కార్మిక సంఘం ఎన్నిక



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలో గీత కార్మిక సొసైటీ నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా బొల్లికొండ యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా బుర్ర శ్రీనివాస్, కోశాధికారిగా బుర్ర బాబురావు, ఉపాధ్యక్షులుగా చిర్ర నర్సింగ్ గౌడ్, మోడెం రాజు, పిల్లల సుధాకర్, బండి కరుణాకర్, నాగపురి రాంకీ, బొల్లపెల్లి శేఖర్, కొండా రాజేందర్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



కాజీపేట అర్బన్: తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను టీపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం ఆధ్వర్యంలో హనుమకొండ అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 29, 30వ తేదీల్లో వరంగల్‌లో నిర్వహించనున్న టీపీఎఫ్ 4వ రాష్ట్ర మహాసభల్లో ప్రజాస్వామికవాదులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్ సంజీవ్‌రావు, అంబటి అంబన్న, ప్రవీణ్‌కుమార్, పాకాల వెంకన్న, యాకన్న, చార్వాక, నాగరాజు, సోమన్న, కవిత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కాజీపేట అర్బన్: టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) సీఐటీయూ రాష్ట్ర 4వ మహాసభ వాల్‌పోస్టర్లను వరంగల్ -1 డిపోలో ఆదివారం ఆవిష్కరించారు. జూన్ 21, 22వ తేదీల్లో ఖమ్మం నగరంలో కామ్రేడ్ నేపాల్ దేవ్‌నగర్‌లోని ఎర్ర శ్రీకాంత్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు తెలిపారు. మహాసభలకు టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు భారీసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుకు సన్మానం



రామన్నపేట: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవీ శ్రీనివాసరావు నియామకమయ్యారు. ఈమేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులందరు ఆయనను ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్‌కుమార్, వసంత్‌కుమార్, మహేందర్, ఈ.శ్రీనివాస్‌రావు, దొడ్డిపల్లి కుమార్, శ్రీనివాసులు, భిక్షపతి, శ్రీకాంత్, కిన్, శ్యాంకుమార్, రంగంపేట నాయకులు సంగీత్, సమద్, రాజ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

సుబేదారి సీఐకి అభినందనలు

వరంగల్ క్రైం: సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్‌ను రాజ్యాధికార పార్టీ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బహుజన రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను సాంబయ్య, ఉపాధ్యక్షులు పిసరి రజిత, ఎడ్ల రవి, ఎండీ.సాహిదా పాల్గొన్నారు.

‘భూభారతి’తో మోక్షం కలిగేనా?

● సాదాబైనామా రైతుల్లో నెలకొన్న ఆశలు



కాజీపేట: ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టంతో సాదాబైనామా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాగితాలపై క్రయవిక్రయ ఒప్పందాలు రాసుకొని భూములు కొనుగోలు చేసిన వారి సమస్య పరిష్కారానికి మోక్షం లభిస్తుందనే నమ్మకంతో ఉన్నారు. గ్రామాల వారీగా కొనసాగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వాటిని పరిష్కరించాలని ప్రజల నుంచి దరఖాస్తులు వస్తున్నాయి.

ఏళ్లుగా ఎదురుచూపులు

సాదాబైనామాతో భూములు కొనుగోలు చేసిన రైతులకు యాజమాన్య హక్కులు లభించకపోవడంతో సమస్య పరిష్కారానికి అనేక ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. వాటి పరిష్కారానికి సాదా బైనామాలతో రికార్డుల్లో పేరు మార్చుకునేందుకు 2017, 2020లలో అప్పటి ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2014, జూన్ 2కు ముందు తెల్లకాగితాలపై కొనుగోలు చేసిన భూములన్నింటిని క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తులు స్వీకరించింది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 32వేల మందికిపైగా దరఖాస్తులు పెట్టుకున్నారు. అయినా వాటికి ఇప్పటి వరకూ మోక్షం లభించలేదు.

యాజమాన్య హక్కులు

భూ భారతి చట్టం ద్వారా సాదాబైనామా రైతుల సమస్య పరిష్కారమైతే వారికి సదరు భూమిపై యాజమాన్య హక్కు లభిస్తుంది. రికార్డుల్లో వారి పేర్లు ఎక్కి ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతు బీమా లాంటి పథకాలు వర్తిస్తాయి. భూములు విక్రయించిన వారి వారసులతో క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులుండవు. తెల్ల కాగితాలు, బాండ్ పేపర్లపై కొనుగోలు చేసిన వారి నుంచి తిరిగి భూములు తీసుకునే హక్కు ఎవరికీ ఉండదు.

దరఖాస్తుల వెల్లువ

గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులో వాటి పరిష్కారానికి రైతులు మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు ఉండగా, ఇప్పటి వరకు హనుమకొండ జిల్లాలో 6,350కి పైగా దరఖాస్తులు అందినట్లు సమాచారం. చివరి రోజుల్లో వరకు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

‘కగార్’ను నిరసిస్తూ రేపు మహాధర్నా



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వరంగల్: మధ్య భారత దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో 2024, జనవరి నుంచి నేటి వరకు ఆదివాసులతోపాటు మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తల హత్యాకాండను నిరసిస్తూ ఈనెల 17వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్ పిలుపునిచ్చారు. మహాధర్నా వాల్‌పోస్టర్లను కాశిబుగ్గ జంక్షన్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం చట్టాల పేరుతో ఆదివాసుల హక్కులను కాలరాసి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కేంద్రం కుట్రలు పన్నుతోందని విమర్శించారు. మహాధర్నాలో ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు, మేధావులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాంపల్లి ప్రవీణ్, గుడికందుల క్రాంతి, జన్నుకుమార్, రాచర్ల బాలరాజు, వెంకటస్వామి, మానవ హక్కుల సంఘం నాయకులు పాలకుర్తి సత్యనారాయణ, నలిగంటి పాల్, నలిగంటి చంద్రమౌళి, రాజేందర్, శ్యామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికులను క్రమబద్ధీకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని జీఎంహెచ్ ఆవరణలో యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. వారందరిని రెగ్యులర్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు కార్మిక హక్కులను కాలరాస్తూ 24 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. జులై 9న జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జీఎంహెచ్ సీఐటీయూ యూనియన్ నాయకులు కళావతి, అనిల్, పుష్ప, వనమాల, కోమల, విమల, సాబీర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ సప్లై కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య



నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

వరంగల్ అర్బన్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న నీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. వరంగల్ దేశాయిపేట ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌లో వాటర్ సరఫరా కార్మికుల సమావేశం విజయ్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ నగర కార్పొరేషన్‌లో సుమారు 400 మంది వాటర్ సప్లై కార్మికులు పనిచేస్తున్నారని గుర్తుచేశారు. గత ఏడేళ్లుగా వారికి యూనిఫాం, రెయిన్ కోట్లు అందించడం లేదని వాపోయారు. జూలై 9న దేశవ్యాప్తంగా జరగనున్న అఖిల భారత కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాటర్ సప్లై కార్మిక సంఘం నాయకులు సుద్దాల కుమార్, అర్జున్, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్యవైశ్య సంఘం’ ప్రమాణ స్వీకారం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ప్రతినిధులు

● 100 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

వరంగల్ చౌరస్తా: ఆర్యవైశ్య వాసవిమాత పరపతి సంఘం అధ్యక్షుడిగా ఇరుకుల్ల రమేష్ తిరిగి ఎన్నికయ్యారు. వరంగల్ రామన్నపేటలోని ఆర్యవైశ్య సత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కార్యవర్గం కొలువుదీరింది. ప్రధాన కార్యదర్శిగా అకినపెల్లి సత్యనారాయణ, కోశాధికారిగా బెజుగం రజనీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాజీ మున్సిపల్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ తోట నవీన్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలగందుల రమేష్, కుంచం వీరభద్రరావు, గట్టు మహేష్, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి శ్రీధర్ సుమన్ పాల్గొన్నారు. అనంతరం 100 మంది ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ విద్యాసంస్థలు సైతం కార్పొరేట్ సంస్థలతో ధీటుగా రాణిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో గట్టు మహేష్, గంగిశెట్టి హరినాథ్, పాలరాపు పనేష్, దివ్వెల శ్రీనివాస్, నీల రాజన్న, నాగరాజు, పసునూరి శ్రీనివాస్, ఆకుల సర్వేశ్వర్ రావు, కొత్త వెంకటకృష్ణ, శిరుప మాధవ్, గౌరిశెట్టి శ్రీనివాస్, అంచురి కరుణాకర్, పబ్బ కిషోర్, గన్ను సతీష్, పుల్లూరు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి



కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

ఖిలా వరంగల్: పేద విద్యార్థుల ఉన్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ నేత, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సూచించారు. వరంగల్ శంభునిపేటలోని విశ్వనాథ కాలనీలో బీజేపీ నాయకుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పేద విద్యార్థులకు నోటు బుక్స్, పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రదీప్‌రావు హాజరై విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తోందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు, నాయకులు తోట రవీందర్, మంద శ్రీనివాస్, కత్తి సాంబయ్య, వెలుగు రవికుమార్, కత్తి ఎల్లగౌడ్, వలుపదాస్ కృష్ణ, కర్నె వాసుదేవ్, అర్జున్ గౌడ్, పేర్ల అనిల్‌కుమార్, ఆకుతోట రాజు, గంగరాజు, సుభాష్‌రావు, శ్రీనివాస్ గుప్తా, విజయ్ గంగరాజు, గంద గోపి, సంజీవ్, నిహారిక, ఎల్లయ్య, వినయ్ పాల్గొన్నారు.

డ్రెయినేజీలో చెత్తాచెదారం

ఖిలా వరంగల్: వరంగల్ 21వ డివిజన్ ఎల్‌బీనగర్ హిందూ శ్మశాన వాటిక సమీపంలో రోడ్డులో, పెద్ద మోరీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. డ్రెయినేజీలోని మురుగునీరు ముందుకు సాగక రోడ్లపై పారుతోంది. ఈ క్రమంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని తిలక్ రోడ్డు డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు లక్కిరెడ్డి పూర్ణేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మరియాల రాజేందర్, సుందరగిరి శ్రీనివాస్, గుండు శంకర్, దాసారపు రమేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల వాకర్స్ రక్తదాన శిబిరం



ఏకశిల పార్కులో రక్తదానం చేస్తున్న వాకర్స్

కాజీపేట అర్బన్: హనుమకొండలోని ఏకశిల పార్కులోని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో తలసేమియా వ్యాధిగ్రస్త పిల్లల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగా రాజిరెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు తీవ్రరక్త కొరత ఉందనే సమాచారంతో రక్తదాన శిబిరాన్ని ప్రతీ ఏడాది ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కూరాకుల భారతి, ఎల్లాగౌడ్, దశరథ రామిరెడ్డి, సోమయ్య, రెడ్‌క్రాస్ సభ్యులు వేణుగోపాల్, బొద్దిరెడ్డి రాజిరెడ్డి, వీరాస్వామి పాల్గొన్నారు.

వాసవీయుల సేవా కార్యక్రమాలు



పనిముట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా: వరంగల్ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పిన్నావారి వీధిలోని క్లబ్ భవన్‌లో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చెప్పులు కుట్టే కార్మికులకు కిట్లు, అడ్డా కూలీలకు పనిముట్లు, హనుమాన్ జంక్షన్ వద్ద 2 సిమెంట్ బల్లల ఏర్పాటు, అంగవైకల్యం కలిగిన వారికి చైతన్య సృజన కిట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు తోనుపునూరి వీరన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో క్లబ్ కేసీజీఎఫ్ పుల్లూరి ప్రకాశ్, ప్రతినిధులు వల్లాల శైలజ, వెంకట నారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సంపత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం, తాజాగా భద్రకాళి దేవస్థాన పాలక మండలి సభ్యుడిగా నియమితుడైన తోనుపునూరి వీరన్నను సన్మానించారు.

మంత్రి శ్రీహరికి అభినందనలు

కాజీపేట అర్బన్: రాష్ట్ర మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్‌ను హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్‌తో పాటు తదితరులు అభినందనలు తెలిపారు.

సంక్షిప్తంగా

పర్యావరణాన్ని కాపాడుకుందాం



విద్యారణ్యపురి: సైకిల్‌పై ప్రయాణిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ నుంచి జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం మీదుగా పద్మాక్షి దేవాలయం వరకు ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లకు బదులు బట్ట సంచులను వాడాలని సూచించారు. ప్రతిరోజు కొంతసమయం సైకిల్‌పై ప్రయాణించాలన్నారు. విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. సైకిల్ ర్యాలీలో సైకిల్ వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి అనంత్, కోశాధికారి రమేష్, బాధ్యులు సత్యనారాయణ, రాజు, రాపర్తి లక్ష్మయ్య, రవి, సురేందర్, అలీ, రాజమౌళి, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

తూర్పుకోటలోని సమస్యలు పరిష్కరించాలి



ఖిలా వరంగల్: తూర్పుకోటలో పేరుకుపోయిన ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంసీపీఐ (యూ) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ డిమాండ్‌చేశారు. ఖిలా వరంగల్ తూర్పుకోటలో నలివేల రవి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో జగదీశ్వర్ మాట్లాడారు. తూర్పుకోటలో పలు సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, దాంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రధానంగా హనుమాన్ ఆలయం నుంచి రాతికోట దర్వాజ వరకు, యాదవవాడ నుంచి పోచమ్మ గుడి, పెరకవాడ నుంచి హనుమాన్ వీధి వరకు, కోమట్ల బండ నుంచి ముదిరాజ్ వీధి వరకు రోడ్లు ఇరుకు మారి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అంతర్గత రోడ్లను విస్తరించి అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, రాయినేని అయిలయ్య, ఇట్టినేని సూరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, జాంబవి సంఘ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు షేక్ అజ్గర్, సిరిల్‌లారెన్స్, దొంగల కుమార్, సిలువేరు విజయ్‌భాస్కర్, దువ్వ రాజులు, బర్ల రాజ్‌కుమార్, గరిగ శివ, టి.మధు, భిక్షపతి, పోగుల శ్రీనివాస్, మాతంగి స్వామి, సల్లూరి నాగేష్, దార్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఎస్‌ఎఫ్ జవాన్ రాకేష్‌కు సన్మానం



మామునూరు: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని మామునూరుకు చేరిన బీఎస్‌ఎఫ్ జవాన్ రేగొండ రాకేష్‌ను క్యాంప్ స్కూల్ 1995వ ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా మామునూరు స్కూల్ పీఈటీ జలగం చలపతిరావు హాజరై పూర్వ విద్యార్థులతో కలిసి జవాన్ రాకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అల్లూరి రత్నాకర్, గంట రాము, అక్బర్, సల్లూరి సత్యనారాయణ, చెక్కు డ్యామ్, ఆడెపు శ్రీనివాస్, అనుమాల రాము, ముక్బుల్, అంజత్, కవిత, లక్ష్మి, శైలజ, లత, అహ్మద్, ప్రసాద్, మునిస్వామి, ఎస్‌బీ ఎస్సై చక్రధర్, కార్పొరేటర్ జలగం అనిత, రంజిత్, రాకేష్ పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ.. కుటుంబీకుల బాధ్యత



వరంగల్ చౌరస్తా: నినాదాలు చేస్తున్న వయోవృద్ధులు, సంఘాల నాయకులు



విద్యారణ్యపురి: ఆశ్రమంలోని వృద్ధుల సమస్యలు తెలుసుకుంటున్న అనితారెడ్డి

వరంగల్ చౌరస్తా: వృద్ధుల సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదేనని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోస్‌రెడ్డి మల్లారెడ్డి అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా వరంగల్ కాశిబుగ్గ సెంటర్ ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కుటుంబాల్లో తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మ, నాన్నమ్మలను కుటుంబ సభ్యులు మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదేనని, ఈక్రమంలో వారిని గౌరవంగా పోషించి రక్షణ కల్పించాలని సూచించారు. వద్ధులకు ఏమైనా సమస్యలు ఎదురైతే 14567 నంబర్‌కు కాల్ చేయాలని, ఉచిత న్యాయం కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మార్త యుగంధర్ రావు, సూర్యనారాయణ, తుమ్మ వీరయ్య, నిజామొద్దీన్, నిమ్మకాయల సదానందం, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, వెంకటయ్య, రమేష్, వీరస్వామి, సోమయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యం ఎవరికీ శాపం కాకూడదు

విద్యారణ్యపురి: వృద్ధాప్యం ఎవరికీ శాపం కాకూడదని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్, కేయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని లార్డు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల చట్టం, ట్రిబ్యునల్ కోర్టుల గురించి వారికి వివరించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ వయోవృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాణి, నరేష్, మమత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకు సంఘాలు దోహదం

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సంఘం సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: ఆర్థికంగా ఎదిగేందుకు పరపతి సంఘాలు ఎంతగానో దోహదపడుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ 5వ డివిజన్‌లోని కొత్తూరు పద్మశాలి పరపతి సంఘం 27వ వార్షికోత్సవం స్థానిక పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పరపతి సంఘాలతో ఆర్థిక తోడ్పాటుతో పాటు ఐకమత్యం పెంపొందుతుందని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తాడిశెట్టి విద్యాసాగర్, సంఘం అధ్యక్షుడు తౌటం విజేందర్, కార్యదర్శి బింగి శ్రీనివాస్, కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ, చిప్ప మురళి, చంద్రశేఖర్, సుధాకర్, వెంకటయ్య, ఆనందం, సురేష్, సూర్యనారాయణ, శివాజీ, అశోక్, అనిల్, సంతోష్, అనిల్, సుకుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటితో ఇంటి కల సాకారం

కాజీపేట అర్బన్: నిరుపేదల ఇంటి కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 52వ డివిజన్ పరిధిలోని రాంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ హౌసింగ్ పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తడుక సుమన్‌గౌడ్, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు సంపత్, అజీజ్ ఉల్లాబేగ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మడికొండ: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



కాజీపేట: ఒకే వేదికపై వెస్లీ పూర్వ విద్యార్థులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 1988 - 89లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకచోట కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నల్ల ప్రవీణ్‌కుమార్, దండిగం రవీందర్, జి.ప్రభాకర్, చందు, శివ, అజీజ్, భిక్షపతి గుప్తా, పేపర్ రవి తదితరులు పాల్గొన్నారు.

వెస్లీ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని వెస్లీ పబ్లిక్ స్కూల్‌లో 2007 - 08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. సమ్మేళనంలో స్కూల్ డైరెక్టర్ శ్రీరాంచంద్రమూర్తితో పాటు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సాంబయ్య, పరశురాం, జ్యోతి, వేణుగోపాల్, శ్రీనివాస్, ఫణీందర్ పాల్గొన్నారు.